కథ

# డ్రాకులా

**సంగీత్‌లో మేట్నీ షో చూసి పక్కనే ఉన్న పిజ్జా కార్నర్‌లో ఐస్‌క్రీం తింటూ ముగ్గురూ వేడివేడి కబుర్లలో పడ్డారు.**

"బి.ఇడి పరీక్షలయిపోయిన ఈ శుభసందర్భంలో ఏదైనా చక్కటి హాస్యమున్న సినిమాకి పిలుచుకెళ్లక ఇలాంటి హారర్ సినిమా చూపించటంలో నీ ఉద్దేశ్య మేమిటి? మన భవిష్యత్తు భయానకంగా ఉంటుం దనే సింబాలిజం కోసమా?" ఏదో ఆలోచనలో మునిగి, మౌనంగా ఐస్‌క్రీం తింటున్న గోదాదేవి వైపు చూస్తూ అడిగింది నీరజ.

"అదేం కాదులేవే. దానికి హారర్ నవలలన్నా, సినిమాలన్నా ఇష్టమని మనకు తెలిసిందే కదా. ఎప్పుడు చూసినా స్టీఫెన్‌కింగ్ డీన్‌ఆర్ కూంజ్ రాసిన నవలలు నమిలేస్తో ఉంటుంది. దాని చేతిలో హారర్ నవలలు లేకుండా అదెప్పుడైనా కనిపించిందా చెప్పు?" స్నేహితురాల్ని వెనకేసుకొచ్చింది మనస్విని.

గోదాదేవి బదులివ్వకపోవటంతో, "ఏమిటే సమాధానం చెప్పవూ?

థియేటర్‌లోనేమో భయంతో చలిజ్వరం వచ్చినట్లు వణికించావు. ఇప్పుడేమో ఐస్‌క్రీం తినిపించి చలి పుట్టిస్తున్నావు. నీకసలు ఆ దిక్కుమాలిన హారర్ కథలు ఎలా నచ్చుతాయే" అంది నీరజ.

గోదాదేవి తలఎత్తి స్నేహితురాళ్లిద్దరి వైపూ చూసి నవ్వింది. అద్భుతమైన నవ్వు...

మంచులా తెల్లటి నవ్వు...

వెన్నెల వాగులా చల్లటి నవ్వు...

మల్లెల గుబాళింపులా మధురమైన నవ్వు..సమ్మోహితుల్ని చేస్తూ...

"భయం మన నీడలాంటిది. బ్రతుకు భయం...చావుభయం...మనిషిని వెన్నంటే ఉంటాయి. ఆడపిల్లల జీవితాల నిండా పర్చుకుని ఉండేది అదేగా. అందుకే నాకు భయమంటే ఇష్టం. భయపెట్టే కథలన్నా, సినిమాలన్నా ఇష్టం. ఐనా డ్రాకులా సినిమా ఓ క్లాసిక్. బ్రామ్ స్టోకర్ అనే రచయిత దీన్ని రాసి వందేళ్లు దాటిపోయినా ఈ కథ పాత బడిపోలేదు. ఇప్పటికి ఇదే సబ్జెక్టుతో దాదాపు యాభై సినిమాలైనా తీసి ఉంటారు తెలుసా" అంది గోదా.

"డ్రాకులా అంటే తెలీని వారికి కూడా అర్థమయ్యేలా వీడి తెలుగు ట్రాన్స్‌లేషన్ చూశావా? రక్తం తాగే పిశాచి ఆట...వింటేనే వళ్లు జలదరిస్తోంది" కళ్లు విప్పార్చి చెప్పింది మనస్విని.

"మనం ఇరవై ఒకటో శతాబ్దంలో ఉన్నామన్న విషయం మర్చిపోయి ఇలాంటి సినిమాలు తీయటం...మనం చూడటం...ఘోరం కదూ. సైన్స్ మన ఊహాకందనంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి కంప్యూటర్ యుగంలో ఇలాంటివన్నీ ఎంత అశాస్త్రీయం! ఎంత అహేతుకం! రేపు పిల్లలకు సైన్స్ పాఠాలు చెప్పాల్సిన మనమే...ఇలా...ప్చ్" అంది నీరజ.

గోదా తన మనోహరమైన నవ్వుని మరోసారి వెదజల్లింది. "మార్స్ గ్రహం పైకి మనం విహారయాత్రకెళ్లేంతగా మానవ మేధస్సు ఎదిగినా, డ్రాకులాలు, రక్తపిశాచాలు పారిపోవు. అప్పుడూ ఉంటాయి. ఇందాక సినిమాలో చూడలేదా? డ్రాకులా చిరంజీవి. ఓ రక్తపు చుక్క పడితే చాలు...రక్తదాహంతో లేచి కూచుంటాడు."

"అబ్బా! ఆపండే...నాకు భయమేస్తోంది" ముడుచుకుపోతూ అంది మనస్విని.

"డ్రాకులాలు ఉండటమేమిటి నాన్సెన్స్. దయ్యాలు, పిశాచాలూ...ఇవన్నీ కట్టు కథలు. నేను నమ్మను. దేన్నయినా కళ్లతో చూడందే నమ్మకూడదు" నీరజ ఆవేశంగా అంది.

"నేను చూశాను. అందుకే నమ్ముతాను" గోదా మొహంలో అనంతమైన ప్రశాంతత...పెదవులపైన అలౌకికమైన చిర్నవ్వు.

మనస్విని ఆసక్తిగా ముందుకు వంగింది.

"నిజంగానే చూశావా? అమ్మో నీకు భయమేయలేదా...నువ్వు చూసింది దయ్యాన్నా...పిశాచాన్నా...అదేం చేసింది? దగ్గరగా వచ్చి తన కోరల్ని నీ మెడలో గుచ్చి రక్తం తాగబోయిందా? నువ్వు పెద్దగా అరవలేదా?" మనస్వినిలో పసిపిల్లలా ఆసక్తి...

"ట్రాష్...నేను నమ్మను. నువ్వు ఏదో భ్రమకులోనై ఉంటావు. ఎప్పుడూ అలాంటి కథలు చదవడం, సినిమాలు చూడటం వల్ల కలిగిన హేలూసినేషన్..." అంది నీరజ.

"నాది భ్రమ కాదు. నిజం...నేను చూసింది డ్రాకులానే...రక్తం పీల్చే డ్రాకులా..."

"ఎక్కడా? శ్మశానంలో చూసావా...ఎలా ఉంది? ఇందాక సినిమాలోని క్రిస్టోఫర్ ప్లమ్మర్‌లా ఆరడుగుల ఎత్తూ, నోటి చివర పదునైన కోరలూ...అది గబ్బిలంలా మారి ఎగిరిపోయిందా?"

"నువ్వు నోర్ముయ్యవే. ఇలాంటి కబుర్లంటే చాలు...చెవి కోసుకుంటుంది" మనస్విని వైపు కోపంగా చూస్తూ అంది నీరజ. గోదా వైపు తిరిగి, "వేయి చెప్పు...లక్ష చెప్పు...నేను నమ్మను" అంది.

గోదాదేవి సమాధానం చెప్పలేదు. తన అద్వితీయమైన తీయటి నవ్వుని పంచుతూ ఉండిపోయింది.

"అవునే...నువ్వంత హాయిగా, అందంగా నవ్వటం వెనుక రహస్యమేమిటో మాకూ చెప్పు. పెళ్లయింది. అత్తగారున్నారు. అయినా అంత విలాసంగా నవ్వగలుగుతున్నావంటే తొందరగా పెళ్లి చేసుకోవాలన్న కోరిక బలపడుతోందే" అంది మనస్విని.

సంభాషణ పెళ్లిమీదకు మరలింది.

"పెళ్లి-సంసారం అద్భుతమైన అనుభవమై ఉంటుందని నిన్ను చూసి మేమందరం ఓ నిశ్చయానికొచ్చేశాం తెలుసా" అంది నీరజ.

గోదా మరలా నవ్వింది. జలజలా నక్షత్రపువ్వులు రాలి దోసిట్లో పడినట్లు...

"పరీక్షలయిపోయాయిగా నెక్స్ట్ ఏం చేయాలనుకుంటున్నారు?" గోదా తన స్నేహితురాళ్లిద్దర్నీ అడిగింది.

"ఏముంది-ఉద్యోగాల వేట... ఆ తర్వాత పెళ్లి...మరి నీవో?" బదులు ప్రశ్నించింది నీరజ.

"పెళ్లయినా బి.ఇడిలో చేరానంటేనే ఉద్యోగం నాకెంత అవసరమో మీకు అర్థమయ్యే ఉంటుంది" అంది గోదా. ఆమె పెదవుల మీద దోబూచులాడుతూ చిర్నవ్వుల సీతాకోకచిలుకలు...

* * *


మూడేళ్ల విరామం తర్వాత ఓ సైన్స్ ఫెయిర్‌లో ముగ్గురూ కలుసుకున్నారు.

"అలా హోటల్లో కూచుని కాఫీ తాగుదాం పదండి" అంటూ నీరజ వాళ్లిద్దర్నీ లాక్కెళ్లింది.

తన వైపు కళ్లార్పకుండా చూస్తున్న మనస్వినిని ఉద్దేశించి- "ఏమిటే అలా తినేసేలా చూస్తున్నావు?" అంది గోదా...ఎప్పటికి మల్లే అతి సుందరంగా నవ్వుతూ.

"నువ్వేమీ మారలేదు గోదా. అలానే ఉన్నావు" అంది మనస్విని. గోదా చేతిలో ఉన్న ఇంగ్లీషు నవల వైపు చూసి- "హారర్ నవలలు చదవడం మానలేదన్న మాట. ఇదీ డ్రాకులా నవలేనా?" అంది.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా- "మనం మూడేళ్ల క్రితం డ్రాకులా గురించి వాదించుకున్నాం గుర్తుందా? ఇప్పటికైనా ఒప్పుకుంటారా నేను చెప్పిందే నిజమని" అంది గోదా. ఆమె కళ్లలోని వింత మెరుపు



పెదవుల మీద పరావర్తనం చెందుతూ...

నీరజ మనోఫలకం మీద పొడవాటి కోరల్తో పిశాచంలా రక్తం జుర్రుకుంటున్న తన అత్త కనిపించింది. తన రక్తమూ, ఆడపిల్లను కన్న పాపానికి తన నాన్న రక్తమూ ఆబగా తాగేస్తూ ఎంత తాగినా ఇంకా ఆకలి తీరక అవురావురుమంటూ...

మొదట లక్షన్నర కట్నం అడిగింది. లక్షకు మించి ఇచ్చుకునే శక్తి లేదని కాళ్లావేళ్లా పడినా కనికరించలేదు. ఇల్లు తాకట్టు పెట్టి డబ్బు సర్దుబాటు చేశాడు తన తండ్రి. మొదటి పండక్కి స్కూటర్ కావాలంది. రెండో పండక్కి 'కారు ఇన్‌స్టాల్‌మెంట్లలో కొంటాడట. నెలనెలా వాయిదాలు మీరు కట్టండి. కారెక్కి జల్సాగా తిరిగేది మీ అమ్మాయేగా' అంటూ రక్తం పిండింది. పెళ్లి చేయాల్సిన మరో కూతురుందని కుమిలిపోతూనే నాన్న ఆమె గొంతెమ్మ కోర్కెలు తీర్చాడు.

ఓ వారం క్రితం 'మీ నాన్ననడిగి మూడు లక్షలు పట్రా. ఫ్లాట్ కొనడానికి తక్కువ పడ్డాయి' అంటూ శాసించింది. ఈసారి కోరలు నేరుగా గుండెల్లో దిగబడ్డాయి.

చివరి రక్తపు చుక్క కూడా తన కోసం ధార పోసి, జీవచ్ఛవంలా మిగిలిన నాన్నని ఏ ముఖంతో అడగాలో... అడక్కుండా అంత డబ్బు ఎలా సర్దాలో అర్థంకాని పరిస్థితి.

"పక్కింట్లో కోడల్ని అత్తగారు కిరోసిన్ పోసి తగులబెట్టిన విషయం నీకు తెలుసుగా నీరజా... మాట వినకపోతే ఏ అత్తయినా ఏం చేస్తుంది చెప్పు? నాకా పరిస్థితి కల్పించకుండా చూడు" అంటూ హెచ్చరికలు కూడా జారీ చేసింది.

అత్తగారి ఉగ్రరూపం గుర్తుకు రాగానే నీరజ గజగజా వణికింది. సంగీత్ థియేటర్‌లో డ్రాకులా సినిమా చూసినపుడు కూడా అంత భయమేయలేదు. ఆమె మొహం రక్తపు చుక్క లేనట్టు తెల్లగా పాలిపోయింది.

మనస్విని ఆలోచనలు ఆమె భర్త చుట్టూ తిరుగుతున్నాయి.

తన భర్తకు డ్రాకులాకున్నట్లు రెండు కోరలే కాదు అదనంగా రెండు కొమ్ములు కూడా ఉన్నాయి. గొడ్డుని బాదినట్లు బాది తన రక్తం కళ్ల చూడందే సుఖంగా నిద్రపోడు. మగాళ్లలో ఇలాంటి మృగాలు కూడా ఉంటాయని తెలిస్తే తను అసలు పెళ్లే చేసుకునేది కాదు.

తన దురదృష్టమో ఏమో అత్తగారి రక్షణ కూడా లేదు. అతని చిన్నప్పుడే చచ్చిపోయింది. మహాతల్లి...తన కొడుకు ఎలాంటి రాక్షసుడో చూడకుండానే వెళ్లిపోయింది.

స్కూలు నుంచి ఇంటికి రాగానే సవాలక్ష ప్రశ్నలు శరీరాన్ని సూదుల్తో గుచ్చుతున్నట్లు...చూపుల్తో తడిమి...ఉరిమి...కత్తి కన్నా పదునైన మాటల్తో తన మనసుని ముక్కలుగా తరిగి...తురిమి...

ఉద్యోగం మానేస్తానంటే అదీ కుదరదంటాడు. "నేనొక్కణ్నే సంపాయిస్తే నువ్వు కూచుని తిందామనా లేక నేనటు వెళ్లగానే ఇటు ఇంట్లోకి ఎవర్నయినా పిల్చుకుని కులుకుదామనా" అంటూ తిట్లతో తనకి అభిషేకం...

ఇద్దరూ ఆలోచనల్లోంచి బైటపడినా సమాధానం ఎలా చెప్పాలో తెలీక గోదావైపు దిగులుగా చూశారు. వాళ్ల కళ్లలో సన్నటి నీటి పొర...

మొదట నీరజ తేరుకుని "నువ్వెప్పుడూ నవ్వుతూ ఉంటే నీ జీవితంలో డ్రాకులాలు ఉండే అవకాశం లేదని పొరపడ్డాను" అంది.

గోదా వినిర్మలంగా నవ్వింది. "వాడు హింసించే కొద్దీ నవ్వటం అలవాటు చేసుకున్నాను.

నన్నేడిపించాలన్న వాడి ప్రయత్నాన్ని నా నవ్వుతో భగ్నం చేయటమే సరైన శిక్ష అనుకున్నాను. కానీ ఓడిపోయాను.

ఇందాక అడిగావే ఇప్పటికీ డ్రాకులా పుస్తకాలు చదువుతున్నావా అని. లేదు.

ఈ పుస్తకం చూశావా? హౌ టు స్లెయిన్ డ్రాకులా...డ్రాకులాని వధించటం ఎలా... ఇప్పుడా ప్రయత్నంలోనే ఉన్నాను."

"అంటే ఏం చేయబోతున్నావు?" మనస్విని ఆసక్తిగా అడిగింది.

"వధించటం అంటే చంపనులేవే...అలాగయితే సుఖపడిపోతాడు. నా కసి తీరదు. వాడు క్షణక్షణం నరకం అనుభవించొద్దూ. వాణ్ని కోర్టుకీడుస్తున్నా" అంది గోదా.

ఆమెలో ఘనీభవించిన అనంతమైన దుఃఖాన్ని కప్పేస్తూ పల్చటి నవ్వు పొర.

మిగతా ఇద్దరూ తమ జీవితాల్లోని డ్రాకులాల నుంచి ఎలా విముక్తి పొందాలా అనే ఆలోచనల్లో మునిగి...

అక్కడ చాలాసేపు...గడ్డకట్టిన నిశ్శబ్దం...

**సలీం**